క్లుప్తంగా

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: చండీఘర్‌లోని పంజాబ్ యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో ఈనెల 17 నుంచి 21 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మహిళల సాఫ్ట్ బాల్ పోటీలకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ జట్టుకు సీఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ చెప్పారు. మహిళల విభాగంలో బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థినులు టి.జ్యోతి శ్రీనాగ దుర్గా భవాని, లంకా శిరీషలు ఇటీవల నన్నయ్య వర్సిటీ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచారన్నారు. విద్యార్థిలను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ వడుపు గోపి, ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ అభినందించారు.

ఘనంగా బిషప్ అభిషేకం



కార్యక్రమంలో పాల్గొన్న మేడిది జాన్సన్, బిషప్ ఎం.దేవదాసు, పాస్టర్లు

పాలకోడేరు: వేండ్రలో ఫిలాదెల్ఫియా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు వి.సత్యం బిషప్ అభిషేక కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్, బిషప్ సామ్యూల్ పిన్ని బిషప్ ఎం.దేవదాసు పాల్గొని బిషప్‌గా అభిషేకించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి క్రీస్తు పరిచర్య చేస్తున్నారని ఆయనను అభినందించారు. యూపీఏ మండల అధ్యక్షుడు గోపే సాల్మన్‌రాజు, దైవజనులు పాల్గొన్నారు.

కుంభాభిషేకానికి అంకురార్పణ



వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలో వేంచేసియున్న శ్రీ పద్మావతీ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మహాయాగపూర్వక శ్రీవారి అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవానికి అంకురార్పణ చేశారు. అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసచార్యులు, పాణింగిపల్లి పవన్ కుమార్ ఆచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కుక్కల బాల వెంకటరత్నం, జానపాటి మధు, గొన్నా బత్తుల మల్లేశ్వర రావు, తాడికొండ కోటేశ్వరరావు గుప్తా, కడలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రముఖ ఫార్మా కంపెనీ హెటిరో డ్రగ్స్ ఇటీవల విష్ణు క్యాంపస్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో బీవీ రాజు కళాశాల విద్యార్థులు 30 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఐఆర్‌కే రాజు తెలిపారు. ఎమ్మెస్సీ ఆర్గానిక్, ఎనలైటికల్ విభాగాల్లో విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

అరుణకుమారికి ఉత్తమ మహిళా పురస్కారం



పళ్లెం అరుణకుమారిని సత్కరించిన దృశ్యం

ఆకివీడు: మహిళలకు సేవలందిస్తున్న మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పళ్లెం అరుణ కుమారికి రాష్ట్ర ఉత్తమ మహిళా అవార్డును అందజేశారు. మహిళా దినోత్సవం రోజున విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో అవార్డు, పురస్కారం, సత్కారం జరిగిందని ఆమె సోమవారం విలేకరులకు తెలిపారు. అవార్డు లభించడానికి కారణమైన శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, నాయకులు గోకరాజు రామరాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

భీమవరంలో 97.5 శాతం ఎమ్మెల్సీ పోలింగ్



భీమవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వస్తున్న ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్



భీమవరంలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఆర్డీఓ దాసి రాజు



భీమవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులకు సీల్ వేస్తున్న సిబ్బంది



భీమవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన మహిళా ప్రజాప్రతినిధులు

సాక్షి, భీమవరం: భీమవరంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 97.5 శాతం మంది ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పర్యవేక్షణ, ఎస్పీ యు.రవిప్రకాష్ సారథ్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ఘట్టం పూర్తయింది. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభంకాగా మొట్టమొదటి ఓటును వీరవాసరం ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని వినియోగించుకోగా, 9 గంటలకు కేవలం రెండు ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఉదయం 11 గంటలకు 101 ఓట్లు, 11.15 గంటలకు 156 ఓట్లు పోల్‌కాగా మధ్యాహ్నం 12 గంటలకు 184 ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ గడువు ముగిసేసరికి మొత్తం 201 ఓట్లకుగాను 195 మంది ప్రజాప్రతినిధులు ఓట్లు వేశారు. భీమవరం పోలింగ్ కేంద్రంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, భీమవరం, ఉండి ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, మంతెన రామరాజు, జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కవురు శ్రీనివాస్, భీమవరం ఎంపీపీ, జెడ్పీటీసీలు పేరిచర్ల విజయనర్సింహరాజు, కాండ్రుగుల నర్సింహరావు తదితరులు ఓట్లు వేశారు. భీమవరం, వీరవాసరం, పెంటపాడు, తాడేపల్లిగూడెం, ఆకివీడు నగర పంచాయతీల్లో నూరు శాతం ఓట్లు పోలవడం విశేషం. ఓటు వేసిన 195 మందిలో 101 మంది మహిళలు, 94 మంది పురుషులున్నారు.

వీరు ఓటు హక్కు వినియోగించుకోలేదు..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భీమవరం పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోలేకపోయిన వారి వివరాలిలా ఉన్నాయి. ఎమ్మెల్సీ మంతెన వెంకటసత్యనారాయణరాజు (ఉండి), మంతెన వెంకట్రాజు(ఆకివీడు జెడ్పీటీసీ), పెద్దిశెట్టి లక్ష్మీతులసి (పాలకోడేరు జెడ్పీటీసీ), పి.సూర్యనారాయణరాజు (ఆకివీడు మండలం దుంపగడప ఎంపీటీసీ), జి.సత్యనారాయణ (కాళ్ల మండలం దొడ్డనపూడి ఎంపీటీసీ, తండా జ్యోతి (అత్తిలి-4 ఎంపీటీసీ) వీరంతా వివిధ కారణాల వల్ల ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు.

ఏలూరుకు పోలింగ్ బాక్స్‌ల తరలింపు

భీమవరం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పూర్తి అయిన తరువాత అభ్యర్థులు ఏర్పాటు చేసిన ఏజెంట్స్ సమక్షంలో పోలింగ్ బాక్స్‌లకు సీల్స్ వేసి బాక్స్‌లను పోలీసు బందోబస్తు మధ్య ఏలూరులోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు.

మండలాల వారీగా ఓట్ల సంఖ్య, పోలైన ఓట్ల వివరాలు

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
భీమవరం	21	21
వీరవాసరం	20	20
ఆకివీడు	13	11
కాళ్ల	20	19
పాలకోడేరు	20	19
ఉండి	22	21
అత్తిలి	21	20
పెంటపాడు	20	20
తాడేపల్లిగూడెం	24	24
ఆకివీడు	20	20

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు ఖాయం



ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో పోటీచేసే సత్తాలేక స్వతంత్ర అభ్యర్థికి మద్దతిచ్చింది. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ పక్షానే ఉన్నారని మరోసారి రుజువుకానుంది.

– గ్రంధి శ్రీనివాస్ ఎమ్మెల్యే, భీమవరం

బలం లేకున్నా టీడీపీ పోటీ



ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి బలం లేకున్నా దొడ్డిదారిని అభ్యర్థిని నిలబెట్టి స్వతంత్ర అభ్యర్థి అంటూ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటు. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థన మేరకు వైఎస్సార్‌సీపీ పోటీ నుంచి తప్పుకుంది. అయితే ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ దుర్బుద్ధితో స్వతంత్ర అభ్యర్థికి మద్దతిచ్చింది. ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరు.

– కవురు శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ అభ్యర్థి

ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే



ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించనుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే మా విజయానికి దోహదపడతాయి. టీడీపీ, జనసేన పార్టీలు కలసి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజల మనస్సు గెలుచుకోలేరు. వారి మద్దతు ఎప్పుడూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉంటుంది.

– వంక రవీంద్రనాథ్, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి

సంక్షేమానికి జగన్ ప్రభుత్వం పెద్దపీట



ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులతో పీవీఎల్

కాళ్ల: రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపేట వేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. భీమవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రానికి పీవీఎల్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, నగర పంచాయతీ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. నియోజకవర్గ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం తరలిన ప్రజాప్రతినిధులు



ఆకివీడు నుంచి బయలుదేరిన ప్రజాప్రతినిధులు

ఆకివీడు: భీమవరంలో ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా ఓటు వేసేందుకు ఆకివీడు మండలం, పట్టణం నుంచి ప్రజాప్రతినిధులు సోమవారం తరలివెళ్లారు. ఓటు వేసేందుకు వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు, నగర పంచాయతీ కౌన్సిలర్లు వెళ్లగా, వారి వెంట స్థానిక నాయకులు కేశిరెడ్డి మురళీ, నంద్యాల సీతారామయ్య, మోటుపల్లి గంగాధర రావు, శిరపు శ్రీనివాస్, కఠారి కేశవరావు, గుండా సుందరరామనాయుడు, తిప్పా దుర్గా భవానీ తదితరులున్నారు.

సీజనల్ జ్వరాలపై గ్రామాల్లో సర్వే



గొరగనమూడిలో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పాలకోడేరు: పరిసరాల పరిశుభ్రత, వేడి నీటిని తాగడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని హెల్త్ సూపర్‌వైజర్ శంకర్ అన్నారు. గొరగనమూడిలో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆరోగ్య విషయాలను అడుగుతూ జ్వరాలు పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సిబ్బంది వివరించారు. హెల్త్ అసిస్టెంట్ ఎం.విజయ ప్రసాద్, ఏఎన్ఎం వేదకుమారి, ఆశా వర్కర్లు శాంతి, కుమారి పాల్గొన్నారు.

బొండాడలో అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: బొండాడలో వేంచేసియున్న పోలేరమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల జాతర మహోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత అమ్మవార్లకు వివిధ రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. భక్తులు, దాతల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాలనుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై అమ్మవార్ల ప్రసాదం స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ పెన్మత్స రంగరాజు, ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు, పెద్దలు మన్నే శ్రీనివాసు, కందుల హనుమ బాబు, మందపాటి రవి, మేకా వెంకన్నబాబు, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

పాలకోడేరు: కోరుకొల్లు గ్రామ దేవత పోలేరమ్మ జాతరను సోమవారం రాత్రి ఆలయ కమిటీ గ్రామస్తులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుట్ట బొమ్మలు, కోయ డాన్సులు, గరగ నృత్యాలతో అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రామస్తులతోపాటు ఆడపడుచులు తరలివచ్చారు. సర్పంచ్ మంతెన భారతి, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన యోగీంద్ర కుమార్ బాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఖాజీకి ఘన సత్కారం

సాక్షి, భీమవరం: ప్రభుత్వ ఖాజీగా నియమితులైన మహమ్మద్ మోయజీ ఆలం ఫైజీని ముస్లింలు సోమవారం ఘనంగా సత్కరించారు. భీమవరం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మహమ్మద్ సిద్దిక్ మాట్లాడుతూ నిఖా వ్యవస్థ చాలా పవిత్రమైందని, దీనిని గవర్నమెంట్ ఖాజీలు ఎంతో బాధ్యతతో నిర్వహించాలన్నారు. డివిజన్‌కు మహమ్మద్ మోయజీ ఆలం ఫైజి గవర్నమెంట్ ఖాజీగా నియమితులు కావడంపై ముస్లింలు ఎంతో సంతోషించారన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం ముస్లిం కమిటీ అధ్యక్షులు షేక్ రబ్బాని, మొహమ్మద్ కరీముల్లా బాషా, ఇమామ్ పాల్గొన్నారు.

బాధితులకు సాయం

పెనుగొండ: ఆచంట చెరువు గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితులు బొక్కా మారేమ్మ కుటుంబానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. బియ్యం, వంట సామగ్రి, దుప్పట్లు అందించి వారికి మనోధైర్యం కల్పించారు. ఎంపీటీసీ సభ్యులు ఉల్లం జ్యోతి రామానుజం, మనవర్తి విజయ్‌కుమార్, బొక్కా రామకృష్ణ, దాసరి ప్రశాంత్ పాల్గొన్నారు.

భూసర్వేకు రైతులు సహకరించాలి



వెంపలో భూ రీసర్వే ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్షా పథకంలో భాగంగా భూముల రీ సర్వేకు రైతులు అధికారులకు సహకరించాలని తహసీల్దార్ వై.రవికుమార్ కోరారు. వెంపలో సోమవారం డ్రోన్ ద్వారా భూ సర్వే నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు ఎక్కువగా తమ పొలాల వద్ద సర్వే నంబర్లు తెలియక, రికార్డుల్లో భూ వివరాలు ఒకలాగా, క్షేత్రస్థాయిలో భూమి విస్తీర్ణం తక్కువ ఎక్కువగా ఉండటంతో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి రోవర్ పరికరాల ద్వారా ఖచ్చితత్వంతో సర్వే చేసి రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలో ఇప్పటి వరకు నరసింహపురం, యనమదుర్రు, బేతపూడి, తుందుర్రు, దిరుసుమర్రు, కొమరాడ, అనాకోడేరు గ్రామాలలో భూములు రీసర్వే పూర్తి చేశామన్నారు. రీ సర్వే డీటీ ఎన్ఎస్ఎస్‌వీ ప్రసాద్, మండల సర్వేయర్ జి.నాగబాబు, వీఆర్వో ఆర్.పద్మనాభం, గ్రామ సర్వేయర్ బి.జ్యోతి ప్రియ, సర్పంచ్ ఇంజేటి రాజేశ్వరి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ కలిదిండి మురళీకృష్ణంరాజు, గ్రామ పెద్దలు అల్లూరి కృష్ణంరాజు, కలిదిండి రామచంద్రరాజు, కలిదిండి కాశీవిశ్వనాథరాజు, కలిదిండి అప్పలరాజు పాల్గొన్నారు.

26న ఎస్ఆర్‌కేఆర్‌లో అప్రెంటిస్ వర్క్‌షాప్

ఉండి: భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే అప్రెంటిస్ వర్క్‌షాపునకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలు, ఒకేషనల్ కాలేజ్‌లకు చెందిన ప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు సోమవారం కోరారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్, వ్యవస్థాపకత (ఎంట్రపెన్యూర్‌షిప్) శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌లో అప్రెంటిస్‌షిప్ సంస్కరణలపై, సరళీకరణలపై అవగాహనతో పాటుగా సందేహాల నివృత్తి చేస్తారన్నారు.

స్వల్పకాలిక కోర్సుల్లో చేరండి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్కిల్‌హబ్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న స్వల్పకాలిక కోర్సుల్లో ఆసక్తిగల యువకులు ఉచిత శిక్షణ పొందవచ్చని ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. 10వ తరగతి అర్హత కలిగి, 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు నేరుగా ఐటీఐకి వచ్చి కోర్సుల కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫీల్డ్‌టెక్నీషియన్ ఎయిర్ కండీషనర్ (3 నెలల శిక్షణ), ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్(3 నెలలు), అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ (3 నెలలు), ఎలక్ట్రికల్ టెక్నీషియన్ (2 నెలలు), మెషిన్ ఆపరేటర్ (2 నెలలు) స్వల్పకాలిక కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈ నెల 15వ తేదీ నాటికి రిజిస్ట్రేషన్స్ చేయించుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు 96760 99988 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చునని వివరించారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పాలకోడేరు: పాలకోడేరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని పీహెచ్‌సీ వైద్యుడు రంగం నాయుడు సోమవారం చెప్పారు. మండలంలోని 50 పాఠశాలలో, 48 అంగనవాడీ కేంద్రాల్లో ఉన్న 8,764 మంది విద్యార్థులకు, చిన్నారులకు ఈ మాత్రలు వేస్తామన్నారు. ఈ మాత్రలు వేసుకోవడం ద్వారా నులి పురుగును నివారించడమే కాకుండా రక్తహీనత సమస్య లేకుండా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు ఈ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.

నేటి నుంచి మాత్రల పంపిణీ

ఉండి: మండలంలోని అన్ని అంగన్‌వాడీలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం నుంచి నులిపురుగుల నివారణ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తామని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పి.ధర్మతేజ్ చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వయసు ఉన్నవారు ఈ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఉండి పీహెచ్‌సీ పరిధిలో 19 ఏళ్ల వయస్సు లోపు ఉన్నవారు 5,383 మంది ఉండగా, 5,900 మాత్రలు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయన్నారు.

13 మందికి అంగవైకల్య పరీక్షలు



సదరం క్యాంపులో ఎముకలు సంబంధించి పరీక్షిస్తున్న డాక్టర్ బి.శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ప్రభుత్వాసుపత్రిలో సోమవారం సదరం క్యాంపులో డాక్టర్ బి.శ్రీనివాస్ స్లాట్ బుక్ చేసుకుని వచ్చిన 13 మంది పేషెంట్లను పరీక్షించి వారి అంగవైకల్యం శాతాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటిసారి సదరం క్యాంపునకు వచ్చి అంగవైకల్య శాతం తక్కువగా ఉందని భావించిన వారు రెండోసారి కూడా స్లాట్ బుక్ చేసుకుని మరొక సదరం క్యాంపునకు వెళ్లి అంగవైకల్యం శాతాన్ని నమోదు చేయించుకోవచ్చని చెప్పారు.

స్త్రీల వ్యాధులపై అవగాహన కల్పించాలి

పెనుగొండ: గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీల వ్యాధులపై అవగాహన కల్పించి ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలని పాలకొల్లు శేషాద్రి హస్పిటల్ వైద్యురాలు డాక్టర్ గుణ్ణం సజయశ్రీ అన్నారు. సోమవారం పెనుగొండలో ది ప్రైమరీ మెడికల్ ప్రాక్టిషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పెనుగొండ యూనిట్ సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గుణ్ణం నారాయణరావు, సంఘ అధ్యక్షుడు ఎన్‌కేవీవీ నారాయణ (కోటి), సీనియర్ సభ్యులు తోట వెంకటేశ్వరరావు, మండ సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు, సునీత పాల్గొన్నారు.

పీవీఎల్‌ను కలిసిన స్త్రీ నిధి డైరెక్టర్



పీవీఎల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అరుణ

ఆకివీడు: మహిళా సమాఖ్య రాష్ట్ర స్త్రీనిధి డైరెక్టర్‌గా నియమితులైన జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పళ్లెం అరుణకుమారి సోమవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గత నెలలో విజయవాడలో రాష్ట్ర మహిళా సమాఖ్య కార్యాలయంలో రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరగగా, ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని అందుకున్న ఆమె సోమవారం పీవీఎల్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కుమారిని స్త్రీనిధి డైరెక్టర్‌గా ఎన్నుకోవడం అభినందనీయమని పీవీఎల్ అన్నారు.

హుండీల లెక్కింపు

వీరవాసరం: వీరవాసరం, రాయకుదురు గ్రామాలలోని ఆలయాల్లో సోమవారం హుండీలను లెక్కించినట్లు ఈఓ పులగం వేణుగోపాల్ చెప్పారు. శ్రీవీరేశ్వర విశ్వేశ్వరస్వామి ఆలయంలో రూ.28,200, శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో రూ.25,300గా ఆదాయంగా వచ్చాయన్నారు. కందుల సురేష్, శేఖర్, వెంకటేశ్వర్ రావు ,శంకరమంచి రఘురామ శర్మ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వీరవాసరం: వీరవాసరం వీఈసి జూనియర్ కళాశాలలో ఈనెల 15 నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎం.బలరాం సోమవారం చెప్పారు. నవుడూరు, పెనుమంట్ర, రాయకుదురు గ్రామాల్లోని కళాశాలలకు చెందిన 202 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

ఈ-క్రాప్ జాబితాల ప్రదర్శన

వీరవాసరం: ఈ క్రాప్‌లో నమోదైన రైతుల వివరాలతో ఉన్న జాబితాలను పరిశీలించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.గీతాదేవి కోరారు. వీరవాసరంలోని ఆర్‌బీకేలో సోమవారం ఆమె మాట్లాడుతూ దాళ్వా సీజన్‌కు సంబంధించి ప్రతి ఒక్క రైతు కచ్చితంగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఆర్బీకేలో ఈ క్రాప్ జాబితాలను ప్రదర్శించామన్నారు. అభ్యంతరాలు ఉంటే గ్రామ గ్రామ వ్యవసాయ సహాయకులకు, అధికారులకు తెలియజేయాలన్నారు.